క్లుప్తంగా

ఆర్థిక సాయం

భూపాలపల్లి రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఝెల్లంగి సారిక అనే బాలింత, పాపకు జన్మనిచ్చి మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సోమవారం కీర్తిరెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కీర్తిరెడ్డి వెంటపార్టీ అర్బన్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మండల అధ్యక్షుడు విష్ణు, డాక్టర్ రవీందర్, మనోహర్‌రెడ్డి, రామన్న, సత్తిరెడ్డి, భిక్షపతి బూత్ నాయకులు గోపన్న తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



వెంకటాపురం(కె): తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ మండలంలోని రెండో ఏఎన్‌ఎంలు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహేందర్‌కు ఏఐటీయుసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్‌ఎంల సంఘం మండల అధ్యక్షురాలు వీరలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15 రోజుల ముందు నోటీసులు ఇచ్చిన ప్రభుత్వం స్పందించలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, లేని పక్షంలో బుధవారం ఉంచి సమ్మె బాట పట్టనున్నట్లు వెల్లడించారు. పార్వతి, లక్ష్మి, వెంకటరమణ, సరస్వతి, విమల, జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

గ్రామ దేవతలకు మొక్కులు



మంగపేట: మండలంలోని మొట్లగూడెంలో ఆదివాసీ గిరిజనులు అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సోమవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కుటుంబ సమేతంగా అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదివాసీ గిరిజన సాంప్రదాయబద్ధంగా డప్పు చప్పుళ్లతో గ్రామంలోని ముత్యాలమ్మ, పోషమ్మ, బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పాడి, పంటలు బాగుండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ కోళ్లు, మేకలను నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోరెం నర్సింహులు, దాట్ల నర్సింహారావు, సూర్యనారాయణ, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

డబల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరు చేయండి



మంగపేట: మండలంలోని అకినేపల్లిమల్లారంలో గోదావరి వరద ముంపునకు గురైన బాధితులకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాజమళ్ల సుకుమార్ కోరారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. అకినేపల్లిమల్లారం గ్రామం గోదావరి ఒడ్డున లోతట్టు ప్రాంతంలో ఉండటంతో ప్రతీ సంవత్సరం ముంపునకు గురవుతుందన్నారు. ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని ఎత్తైన ప్రదేశానికి తరలిస్తామని అప్పటి కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. విషయంపై స్పందించి గ్రామంలోని బాధిత కుటుంబాలను ఎత్తైన ప్రదేశానికి తరలించి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు.

సీఐకి గ్యాలంటరీ అవార్డు

వెంకటాపురం(కె): వెంకటాపురం సీఐ బండారి కుమార్‌తో పాటు గతంలో ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన సీఐ శివప్రసాద్‌కు గ్యాలంటరీ అవార్డులు వరించాయి. ఏజెన్సీ మండలమైన వెంకటాపురం(కె)లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

రోడ్ల మరమ్మతుకు నిధులు ఇవ్వాలి

కన్నాయిగూడెం: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వసమైన రోడ్లకు మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే సీతక్కను కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందించారు. వర్షాలతో పాటు గోదావరి ఉధృతితో రోడ్లు, పంటపొలాలు పూర్తిగా కొట్టుకుపోయాయని తెలిపినట్లు పేర్కొన్నారు. దీంతో ఎమెల్యే సీతక్క సానుకూలంగా స్పందించారని తెలిపారు

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



మల్హర్: విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న పుట్ట మధు

మల్హర్: ప్రతీ విద్యార్థి చక్కగా చదువుకోని ఉన్నత స్థాయికి ఎదగాలి బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు ఆకాంక్షించారు. మండలంలో తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పుట్ట లింగమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ఉచిత బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. అనంతరం మధు మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి భవిష్యత్‌కు సంబంధించిన అంశాలపై దృష్టిసారించాలని చెప్పారు. పేదింటి బిడ్డల కోసం నిరంతరం ఆలచోన చేస్తున్నామని, తల్లిదండ్రులకు పిల్లల చదువులు భారం కావద్దని పలు కార్యాక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఆకలితో ఉండకూడదని భావించి పుట్ట లింగమ్మ ట్రస్ట్ ద్వారా మధ్యాహ్న భోజనం అందించామని తెలిపారు. ఆర్థిక స్థోమత లేని విదార్థులకు స్టడీ మెటీరియల్స్ అందించి చేయూతనిచ్చామని వెల్లడించారు. రాష్ట్రంలో 80శాతం ఉన్న బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల బాగు కోసం సీఎం కేసీఆర్ ఎంతో గొప్పగా ఆలచోన చేస్తున్నారో ఆదే రీతీలా నియోజకవర్గంలోని అన్ని వర్గాల బాగుకోసం ప్రయత్నం చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్క ప్రకాష్‌రావు, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్, మండల నాయకులు వాల యాదగిరిరావు, బత్తుల తిరుపతి, తాడిచర్ల సర్పంచ్ సత్తయ్య. కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్ బండి రాజయ్య, రాజేశ్వర్‌రావు, మల్లేష్, సదానందం, రవి, మధుసూదన్‌రావు, సుమన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన లచ్చక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు సోమవారం పరామర్శించారు. రైతుబంధు బంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాసరావు, నాయకులు వాల యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ఆత్మీయ సమ్మేళనం



మహదేవపూర్: మాట్లాడుతున్న పుట్ట మధు

మహదేవపూర్: మండల కేంద్రంలో సర్పంచ్ శ్రీపతిబాపు ఆధ్వర్యంలో ముస్లింల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భుపాలపల్లి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిని పాల్గొని మాట్లాడారు. ముస్లింలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాబోవు ఎన్నికల్లో అత్యధిక మెజార్టితో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, మత పెద్దలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి అండగా ఉంటాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

టేకుమట్ల(రేగొండ): నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 15 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆస్పత్రులలో చికిత్స పొంది బిల్లులను అందించిన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సహాయ నిధి, ఎల్‌ఓసీ ద్వారా కూడా చెక్కులను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలను నాటారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండలంలోని దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ స్తంభాలు, తదితరుల పనులను ఆ శాఖాల మండల అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యాధికారులు గ్రామాల్లో ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగరేయాలి



జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న పోలీసులు

కాటారం: అజాద్ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఒక్కరూ వారి ఇంటిపై జెండా ఎగరవేయాలని సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీర్పాల్‌సింగ్, సివిల్ ఎస్సై అభినవ్ తెలిపారు. హర్ ఘర్ తిరంగలో భాగంగా సీఆర్పీఎఫ్ 58వ బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని హై స్కూల్‌తో పాటు ప్రధాన కూడలిలో వ్యాపారస్థులకు, ఆటో డ్రైవర్లకు త్రి వర్ణపతాకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ జెండా ప్రతి ఇంటిపై ఎగరవేసి జాతీ ఐఖ్యతను చాటాలని పిలుపునిచ్చారు. సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

మహదేవపూర్: మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు తప్పవని మహదేవపూర్ ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం కిష్టరావుపేటలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహంచారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మావోయిస్టుల గురించి ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై రమేష్

చిట్యాల: మొగుళ్లపల్లి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన చంద్రమౌళికి చెందిన రెడ్‌మీ10 సెల్ ఫోన్ జూలై 25న పోగొట్టుకున్నాడు. దీంతో చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్ట్‌ల్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జంగిలి రమేష్ చేతుల మీదుగా చంద్రమౌళికి అందజేశారు. ఈ మొబైల్‌ను గుర్తించడంలో సహాయపడిన సీసీటీఎన్ఎస్, డబ్ల్యూపీసీ కోమల, మమతలను ఎస్సై అభినందించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి చంద్రమౌళి కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రికి వైద్య సిబ్బందిని కేటాయించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పంతకాని సమ్మయ్య

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని కేటాయించాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య జిల్లా వైద్యాధికారిని కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది లేకపోవడంతో విచారం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బందిని ఇతర మండలాలకు, ఇతర జిల్లాలకు డిప్యూటేషన్‌పై పంపించడంతో కాటారం ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదన్నారు. ఐదు మండలాలకు కూడలిలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణ అధ్వానంగా తయారైందని పేర్కొన్నారు. డాక్టర్, హెచ్‌వి, హెచ్‌ఈఓ, ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్స్, ఎల్‌టీ, కంప్యూటర్ ఆపరేటర్ తదితర సిబ్బంది లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి దృష్టిసారించి పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని కోరారు. ఎంపీపీ వెంట నాయకుల కొట్టె శ్రీహరి, కుమ్మరి అశోక్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ దరఖాస్తుల విచారణ



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహలక్ష్మి పథకంలో భాగంగా గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ఇంటింటా తిరుగుతూ విచారణ చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం మండలంలోని గండికామారం, మహాముత్తారం గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు వేణు, శివశంకర్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నిక

భూపాలపల్లి రూరల్: ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) జాతీయ కమిటీ సభ్యులుగా పసుల వినయ్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు అఖిల భారత అధ్యక్ష కార్యదర్శులు నీలా శిష్‌బోస్, ప్రసంగిత్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కలకత్తాలో జరిగిన పదోవ అఖిల భారత మహాసభలలో వినయ్‌కుమార్ నియామకాన్ని ప్రకటించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన అఖిలభారత జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

చర్య తీసుకోవాలి



చికిత్స చేయిస్తున్న రాజేందర్

భూపాలపల్లి రూరల్: గోవులను రోడ్లపై వదిలి ప్రమాదాలకు గురి చేస్తున్న యజమానులపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రాణాపాయ స్థితిలో రోడ్డుపై ఉన్న ఆవును చూసిన అనంతరం రాజేందర్ విలేకరులతో మాట్లాడారు. ఎండీ క్వార్టర్స్ ఫస్ట్ బ్లాక్ సమీపంలో మూడు రోజులుగా దెబ్బలు తగిలి నడిరోడ్డుపై ఉన్న ఆవుకు పశువైద్యాధికారిని పిలిపించి చికిత్స చేయించినట్లు తెలిపారు. ఇప్పటికే పట్టణంలో గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఐదు ఆవులు మృతి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టు రవి, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(ఎం)లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్



వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

వెంకటాపురం(ఎం): వర్షాకాలం దృష్ట్యా ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని నల్లగుంటలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 92 మందిని పరీక్షించి మందులు పంపణీ చేశారు. 18 మందికి మలేరియా, టైఫాయిడ్, డెంగి, షుగర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి చుట్టు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. నీరు నిల్వ ఉండడం ద్వారా దోమలు, ఈగలు వ్యాప్తిచెంది సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్ల నివారణ కోసం కాచివడబోసిన నీటినే తాగాలన్నారు. అనారోగ్యం బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. అలాగే బీటీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ అందించారు. డాక్టర్ అనిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, పీహెచ్ఎన్ శోభ, హెచ్‌వీ పుష్పకుమారి, ఏఎన్‌ఎం అనురాధ, ఆశ కార్యకర్తలు రాణి, సంధ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండలంలోని ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మండలంలోని ఆలుబాక పల్లెదవాఖానలో సోమవారం ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, తల్లిపాల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి నెల 14 వ తేదీన పల్లెదవాఖానలో ఆరోగ్య మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల భారీన పడకుండా ప్రజలు అప్రమతంగా ఉండాలని సూచించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



కాటారం: డ్రంకెన్‌డ్రైవ్ పరీక్ష నిర్వహిస్తున్న ఎస్సై అభినవ్




మహాముత్తారం: ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై

కాటారం: మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఎస్సై అభినవ్ వాహన డ్రైవర్లకు సూచించారు. మండలంలోని మద్దులపల్లి వద్ద సోమవారం పలు వాహనాల డ్రైవర్లకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన డ్రైవర్లపై కేసులు నమోదు చేసి వాహనాలు పక్కకు నిలిపివేయించారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహాముత్తారం: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్సై సుధాకర్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆటోడ్రైవర్లు, ఓనర్లకు డ్రైవింగ్‌పై అవగాహన కల్పించారు. రోడ్డు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



బుట్టాయిగూడెంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

కన్నాయిగూడెం: రక్తదానం మరొకరికి ప్రాణ దానమని ఎస్సై సురేష్ అన్నారు. మండలంలోని బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ కార్యలయంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి యువకులు తరలివచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్సై ముఖ్య అతిథిగా హాజరై రక్తదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్న మరొకరి ప్రాణం నిలుస్తుందన్నారు. రక్తం దానం చేసేందుకు యువకులు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, సేవ సంస్థ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌సాయి, బుద్దె సందీప్, కావిరి చిన్నికృష్ణ, అశోక్, ప్రశాంత్, సత్యం, మెడికల్ ఆఫీసర్ మూనిక, మురళి, మల్లికాంబతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

ఏటూరునాగారం: మండలంలోని కొండాయిలో 220 వరద బాధిత కుటుంబాలకు సోమవారం సేవ్ ద లైఫ్ ఆర్గనైజేషన్ ఘన్‌పూర్ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. వరద బాధిత కుటుంబాలకు బట్టలు, బియ్యం, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజషన్ అధ్యక్షుడు రౌతు రాజు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సహకారంతో తోచిన సాయం అందించామన్నారు. భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిలోని 600 వరద బాధిత కుటుంబాలకు, లక్ష్మిదేవిపేట, బూర్గంపేటలో 40 కుటుంబాలకు బియ్యం, సరుకులు, బట్టల అందించామన్నారు. ఆర్గనైజేషన్ ప్రధానకార్యదర్శి పల్లె కిరణ్, రావుల సురేష్, వెంకటేష్, బోళ్ల శ్రీకాంత్, దేవేందర్, సిద్ధు, తాళ్లపెల్లి పాల్గొన్నారు.

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని మేడారం జంపన్నవాగు వరద ఉధృతి కారణంగా భారీగా నష్టపోయిన వడ్డెర వ్యాపారులకు హైదరాబాద్‌కు చెందిన వడ్డెర సంఘం సభ్యులు సోమవారం నిత్యావసర సరుకులు అందించారు. వరదలకు సర్వం కోల్పోయారన్న విషయం తెలుసుకున్న హైదరాబాద్‌కు చెందిన ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లకుంట రమేష్ ఆధ్వర్యంలో 30 మంది బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో గండికోట సాంబారావు, పల్లపు మహేందర్, ప్రసాద్, సాగర్, అల్లకుంట చిన్న, జంపయ్య, సంపత్, సారయ్య, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

ములుగు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గోవిందరావుపేట మండలంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చేయూతనిచ్చారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాం నాయక్ నిత్యావసర సరుకులు అందించారు. వరదల కారణంగా ఇళ్లు ధ్వంసమైన కుటుంబాలకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింత క్రాంతి ఉన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

జయశంకర్ భూపాలపల్లి : 9951602872

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410